# గోదారమ్మ-9

''మీరింత శాంతమూర్తిలా అనిపిస్తున్నారు. మీ అమ్మాయి మాటల్ని మీరెందుకని నమ్మటం లేదూ....?'' అని గోదావరమ్మ ఆవిడను అడిగింది.

కుర్చీలు జరిపి కూర్చోబెట్టాక పూర్ణ అమ్మగారు నిట్టూరుస్తూ చెప్పింది. "అదేదో సామెతలా తాటిచెట్టు క్రింద కూర్చుని పాలు తాగుతున్నామని చెప్పినా ఎవరూ వినరు కదండీ... కల్లే అంటారు కదా.... అందుకే... మేమూ మా అమ్మాయి మాటల్ని కట్టుకథలా కొట్టిపడేసి... వూరి జనం వేసిన నిందను న మ్మాల్సివచ్చింది!

ఏదో పరువూ, మర్యాద అంటూ పాకులాడే చిన్న కుటుంబం మాది. ఏం చేయగలం చెప్పండి. దాని ప్రారబ్ధం అలా వుందని ఓ ఏడ్పు ఏడిచి అలా వదిలేయాల్సివచ్చింది. మరి ఇంకా పిల్లలున్నారు గదండీ...!'' ఆవిడ కంఠం బొంగురుపోయింది.

''నువ్వు బాధపడకు అక్కా. మన పూర్ణని చూసి ఈమె బాగా బాధపడ్డారు. జరిగిందంతా విని నీతో మాట్లాడతానని అంటే... గుడినుండి ఇటువచ్చాం!'' అంటూ పద్మావతి లేచి వచ్చి పూర్ణ తల్లి మహాలక్ష్మి చేయి పట్టుకుంది. మహాలక్ష్మి కళ్ళు తుడుచుకుంటూ నిట్టూర్చింది.

పద్మావతి మాటలకు అవునన్నట్లుగా తలవూపిన గోదారమ్మ మహాలక్ష్మితో చెప్పింది. ''ఈ రోజు కనిపిస్తున్నట్లుగానే పూర్ణను రోజు ఇలా శుభ్రంగా చక్కగా తయారవమనండి. అయినా... పూర్ణ వలన జరిగిన తప్పేముందో మీరే చెప్పండి. అమాయకంగా... అతని వెంట మాయమాటలు నమ్మి వెళ్ళిందంతేగా. ఒకవేళ తప్పే జరిగినా... తల్లిదండ్రులుగా మీరు అండగా నిలబడి ఓదార్పునివ్వాలిగానీ... అలా వెలివేసినట్లుగా వరండాలో కూర్చోబెట్టటం... చేయని నేరానికి పెద్ద శిక్ష వేయటమే అవుతుంది కదండీ...?''

గోదారమ్మ మాటలకు మహాలక్ష్మమ్మ జవాబు చెప్పలేకపోయింది. నోట్లో చీరె చెంగు కుక్కుకుని వెక్కిళ్ళు పెట్టింది.

పద్మావతి, గోదారమ్మా ఇద్దరూ విభ్రాంతిగా చూశారు.

కాసేపటికి ఆవిడ తెప్పరిల్లి ''నేనేం చేయనండీ... ఆయన మాటలకు ఎదురు చెప్పలేను. ఆపైన ఇదీ కూడా తక్కువది కాదు లెండి. తప్పును సరిచేసినట్లుగా ఆ అబ్బాయి తల్లిదండ్రులు ఓ మెట్టు దిగివచ్చి మా పిల్లను

కోడలిగా చేసుకుంటామని వస్తే, చావనైనా చస్తానుగానీ  పెళ్ళికి ఒప్పుకోనని మొండికేసింది. అది తప్పే కదండీ...?'' అనడిగింది.

ఆ ప్రశ్నకి పద్మావతి నిజమే నన్నట్లుగా తలవూపింది.

గోదారమ్మ మాత్రం చురుక్కున చూసింది. “ఆ అమ్మాయి కి ఆ పెళ్ళి మనస్కరించనపుడు కాదనటం తప్పెలా అవుతుందండీ...? చక్కగా చదువుకుంటానన్న పిల్లను చదివించకుండా పెళ్ళిచేసుకోమని ఒత్తిడి చేయటం మన తప్పవుతుంది గానీ...!''

మహాలక్ష్మి రోషంగా బదులిచ్చింది. ''దానిమీద పడిన మచ్చగురించి మర్చిపోయి... ఎలా చదివించమంటారూ...? అది సింగారించుకుని కాలేజికి బయలుదేరితే, ఇంకా కొత్త తలనొప్పులు రావూ...?''

''బావుంది. అందుకని అలా పిచ్చిదానిలా ఓ మూల కూర్చోబెడతారా....? మిగతావాళ్ళలా ఈ అమ్మాయి మీ కడుపున పుట్టినదే కదా... ఒళ్ళు కనిపించేలా దుస్తులు వేసుకుంటే... మగవెధవలకు ప్రదర్శన పెట్టినట్లుగా 'అదేం పని?' అని మందలించవచ్చు. కానీ చక్కగా కనిపించాలనుకోవటటం తప్పని ఎలా చెబుతారు ఎవరైనా...?'' కొంచెం  పదునుగా వచ్చిన గోదారమ్మ మాటలకు సమాధానం చెప్పలేని దానిలా మహాలక్ష్మి తలవంచుకుంది.

ఒక క్షణం తర్వాత మెల్లగా తలవంచుకునే గొణిగినట్లుగా అంది ''మీరన్నది నిజమేగానీ... మా కుటుంబం పరిస్థితి మీరు అర్థంచేసుకోవాలి. ఆయన ఒక్కరే సంపాదించి... ఈ కుటుంబాన్ని ఎలాగో నెట్టుకొస్తున్నారు. ఆయనకు శక్తి చాలకపోతుంటే... నేనెలా ఒత్తిడి చేయగలనండీ...? అందుకే... కన్నతల్లిగా మనసొప్పకపోయినా, ఇలా చేయవలిసివస్తోంది...!'' ఆవిడ గొంతు మళ్ళీ పూడుకుపోయింది.

గోదారమ్మ నిజమేనంటూ నిట్టూర్చింది.

''అందుకే నండీ... నేనొక మార్గం ఆలోచించాను. పూర్ణను చదివిద్దాం. ప్రైవేటుగా చదివి పరీక్షలకు హాజరవుతుంది. తన చదువు ఖర్చు అంతా నాదే. పూర్ణ ఇక నుండీ మా పిల్లే అనుకోండి... మీ ఇంట్లో వుంటుందంతే. తన ఖర్చులూ, బరువు బాధ్యతా అంతా మాదే. మీ వారితో చెప్పి ఒప్పించే పని మాత్రం

మీది. నన్ను మాట్లాడమన్నా పూర్ణ తండ్రితో నేను మాట్లాడతా.'' గోదారమ్మ మాటలకు మహాలక్ష్మి వదనం ప్రసన్నమైంది.

''కానీ... ఇది చక్కగా తయారై తిరుగుతోంటే... ఆ అబ్బాయి వాళ్ళూ వూరుకుంటారా... మళ్ళీ వెంటబడి వేధించరూ... అదే సందే హంగా ఉంది...!'' అందావిడ అపనమ్మకంగా చూస్తూ.

''ఆ విషయం కూడా నేను ఆలోచించానమ్మా. అతగాడిదీ ఈ ఊరే కాబట్టి వాళ్ళ ఇంటికి వెళ్ళి... అతనితోనూ, వాళ్ళ తల్లిదండ్రులతోనూ నేను మాట్లాడతా. కాదంటారని అనుకోవటం లేదు. అసలా అబ్బాయి పట్టుదలమీదే వాళ్ళు పెళ్ళికి ఒప్పుకోవల్సివచ్చి వుంటుందని నా నమ్మకం. అయినా ఇష్టం లేదంటున్న అమ్మాయిని పెళ్ళి చేసుకుని మాత్రం అతనికేం ఆనందం వుంటుందీ...? ఈ మాట అడుగుతాను...!'' అంది గోదావరమ్మ ఏ మాత్రం సంకోచం లేకుండా.

''మీకేం అభ్యంతరం లేదంటే చాలు... పూర్ణ చక్కగా చదువుకుంటుంది. మా ఇంటికి వచ్చే రామచంద్ర చాలా మంచి అబ్బాయి. పూర్ణను ఓ చెల్లెలిగా భావించి చక్కగా ఏం చదవాలో, ఎలా చదవాలో అన్నీ చెబుతాడు. మా సీత కూడా చదువు విషయంలో గానీ, మరే విధమైన సందేహాలు వచ్చినా మార్గనిర్దేశం చేయగలదు! పూర్ణ తనకు తోచినంతవరకూ చక్కగా చదువుకుని, ఆపైన నచ్చిన, వచ్చిన ఉద్యోగంలో స్థిరపడ్డాక... అప్పుడు తన కోరిక ఎలా ఉంటుందో... దాన్ని బట్టి పెళ్ళి సంగతి ఆలోచించుకుంటుంది!

అందుకని... పూర్ణ విషయంలో సమస్యగా ఏమీ అనుకోకండి.." గోదారమ్మ చెప్పిన మాటలకు మహాలక్ష్మి మొహంలోకి ఆనందం వచ్చింది.

''పెద్దవారు మా అమ్మాయి విషయంలో ఇంత శ్రద్ధ చూపించటం దాని అదృష్టమే..!'' అందావిడ ఆనందంగా.

* * *

గోదారమ్మ పూర్ణ గురించి వాగ్దానం చేసినట్లుగానే పనులన్నీ పూర్తిచేసింది.

పూర్ణను అల్లరిపెట్టిన అబ్బాయి గోవిందు తల్లిదండ్రుల ఇంటికి వెళ్ళి పూర్ణ విషయం మాట్లాడింది. వాళ్ళు ముందు కొంచెం గట్టిగా బెట్టుగా మాట్లాడారు.

తమలాంటివాళ్ళు అంతస్తుల భేదం పట్టించుకోకుండా పెళ్ళి మాటలకు వెళ్తే, ఆ పిల్ల కాదంటుందా, అందువల్ల మంచి శాస్తే జరిగిందన్నట్లుగా అహం చూపించారు.

తర్వాత గోదారమ్మ మాటలతో మెత్తబడ్డారు. తమ అబ్బాయి వల్లే తప్పు జరిగిందన్న విషయాన్ని గ్రహించి ఒప్పుకుంటున్నట్లు పశ్చాత్తాపం చూపించారు. పూర్ణ తల్లితండ్రుల మంచితనం వల్లే తమకి కేసుల బాధ లేకుండా పోయిందని అంగీకరించి, ఆ అమ్మాయికి అమాయకత్వమే తప్ప, తప్పేమి జరగలేదని అంగీకరిస్తున్నట్లుగా మాట్లాడడం జరిగింది.

ఆ అమ్మాయిని మళ్ళీ వేధించకుండా తమ అబ్బాయిని మందలిస్తామని మాట కూడా ఇచ్చారు.

అలా పూర్ణ జీవితం ఓ గాడిన పడి చదువుకోగలగటం గోదావరమ్మకు చాలా సంతృప్తి కలిగించింది.

పూర్ణ కూడా మునుపటిలా నిర్లిప్తంగా ఏదీ పట్టనట్లు ఉండకుండా హుషారుగా ఉంటుంది. తనలో అలాంటి మార్పుకు కారణమైన గోదావరమ్మగారికి మరీ మరీ కృతజ్ఞతలు చెప్పింది. అంతా సహకరించటం వలన కుదిరింది కాబట్టి ఆ అమ్మాయి జీవితం ఓ గాడిన పడిందే తప్ప తన గొప్పతనం ఏమీ లేదంటూ గోదారమ్మ నవ్వేసింది..

పూర్ణ కూడా బాధ్యతగా ఇంటి దగ్గర ఉండి చదువుకుంటూనే తల్లికి పనులలో సహాయంగా ఉండటంతో మహాలక్ష్మికి ఆనందంగా ఉంది.

తన ఖర్చు అంతా గోదారమ్మదేనని తెలిసినా, పూర్ణ ఆవిడకు కొంత భారం తగ్గించే ఉద్దేశ్యంతో తనూ ఏదైనా చేసి కొంత సంపాదించగలగాలని నిర్ణయించుకుంది.

కొంతమంది చిన్నపిల్లలకు ట్యూషన్ చెప్పే పని పెట్టుకుంది.

అలా కుటుంబానికీ అండగా ఉండి ఆర్థిక స్తోమత కల్పించటంతో పూర్ణ తండ్రి కూడా ఆనందం వ్యక్తం చేశాడు. 'ఇంకా ప్రోత్సాహంగా ఉంటే... చిన్న పిల్లలకు చిన్న స్కూలూ ప్రారంభించాలనే ఆలోచన ఉన్నట్లు' చెప్పగానే గోదారమ్మ కూడా ముందు ఆశ్చర్యం, తర్వాత ఆనందం చూపించింది.

ఆ అమ్మాయి ఎవరికీ భారం కాకుండా ఆర్థికంగా బలం పుంజుకోవాలనీ, స్వతంరతంగా తన కాళ్ళమీదే నిలబడాలనే ఆలోచనను అంతా మెచ్చుకున్నారు కూడా.

రామచంద్రవర్మ కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్ణకు కావల్సిన పుస్తకాలను సమకూర్చటమే కుండా ఎలా ప్రిపేరవ్వాలనే విషయాలను సలహాలిస్తూ సహకరిస్తున్నాడు.

సీత కూడా తనకు తోచిన సాయం చేయటానికి ఉత్సాహం చూపిస్తూనే ఉంది. అపుడపుడూ పూర్ణ పుస్తకాలను తీసుకుని వస్తూంటే... సీతే వాళ్ళింట్లోనే కుముద, రంగా, పూర్ణలను కూర్చోబెట్టుకుని రామచంద్ర పాఠాలు చెబుతున్నాడు.

తర్వాత ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోవటం జరుగుతుంది.

ఈ చదువుకు ముందో, వెనుకో వీలునుబట్టి కుముద సీతా, గోదారమ్మల దగ్గర కూర్చుని పాటలను వినిపిస్తూ సంగీత పాఠాలను నేర్చుకుంటోంది. ఆ చిన్నమ్మాయికి చెబుతున్నట్లుగా సీత పాటలు వింటూ మైమరిచిపోవటం గోదారమ్మకూ చాలా ఆనందంగా ఉంది.

సీతకూడా పిల్లలను గమనిస్తూ, వాళ్ళ దగ్గరికి వచ్చిపోతూనే వంటపనులను, ఇంటిపనినీ హుషారుగా చక్కబెట్టుకుంటోంది.

ఒకరోజు...

గోదావరమ్మ సీతతో అంది ''సీతా... నువ్వు గమనించావో లేదో గానీ నేను మాత్రం పరీక్షగా చూసాను. సాధారణంగా ఒక తల్లి కడుపున పుట్టిన పిల్లల మధ్య అయినా ఏదో పేచీలు, కోపతాపాలూ ఉంటాయిగా, కానీ కుముద, రంగాల ఇద్దరిమధ్యా అలాంటివేం లేకుండా ఇంత సఖ్యతగా ఉండటం నాకు ఆశ్చర్యంగానే ఉంటుంది ఎందుకనంటావ్....?''

సీత చిరునవ్వుతో చూసింది.

''ఏముందమ్మా... వాళ్ళిద్దరూ అపుడపుడూ కలిసి చదువుకోవటం, ఆడుకోవటం చేస్తూ ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోతున్నారు కదా. అందువల్లే పోటీలు, పేచీలు లేకుండా ఉంటున్నారేమో...!'' అని జవాబిచ్చింది సీత.

''అవునేమో....'' అంటూ ఆవిడ ఒక క్షణం ఆలోచనలో పడింది.

తర్వాత గోదావరమ్మ రామచంద్ర వర్మను కుముదను తమ ఇంట్లో నాలుగు రోజులుంచమని అడిగింది.

''ఏమిటో... కుముదను చూస్తుంటే చాలా ముద్దుగా ఉంటుంది,. ఆడపిల్లలంటే నాకున్న ఇష్టం వలన కాబోలు. రంగా, కుముద కలిసి కాసేపు ఆడుకుంటారు. కుముద పాటలు పాడుతూ వుంటే నాకెంతో

ఆనందంగా, హాయిగా వుంటుంది కూడానూ ! స్కూలుకు సెలవులు కూడా ఇచ్చారుగదా...!'' అని ఆవిడ కారణం కూడా చెప్పింది.

రామచంద్ర సరేనంటూ ఆనందంగా అంగీకరించి కుముదకు కావలసిన బట్టలు, వస్తువులు ఇంటినుండి తెచ్చిచ్చాడు.

నాలుగు రోజులు పిల్లల మధ్య ఎటువంటి గొడవలూ రాలేదు. సఖ్యంగానే ఉన్నారు. వాళ్ళిద్దరిమధ్యా అంతసామరస్యం ఉండటం పెద్దవాళ్ళిద్దరికీ ఆశ్చర్యంగానే అనిపించింది.

ఆ తర్వాత మళ్ళీ గోదారమ్మ సీతను అడిగింది. ''చూశారా సీతా... కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నా కూడా వాళ్ళిద్దరి మధ్యా పేచీలేం రాలేదు...!''

అవునన్నట్లు తలవూపిన సీత చిన్నగా నవ్వింది.

''పిల్లల మధ్య స్నేహం, ఇచ్చి పుచ్చుకునే మంచి అలవాటుండాలనే ఉద్దేశ్యంతో వాళ్ళిద్దరికీ మీరు చెప్పే నీతి కథల ప్రభావం అయివుంటుందేమోనమ్మా...!''

''అయితే... ఆ గొప్పతనం కథలు చెప్పేనాదికాదు... కథల్లోని నీతిని గ్రహించి ఆచరణలో పెట్టగలిగిన పిల్లలదే!'' అంటూ ఆవిడా నవ్వింది.

రామచంద్ర, సీతల పెళ్ళికి పిల్లల మధ్య గొడవలేం రావనీ, సఖ్యంగానే ఉంటారనే విషయం సీతకు తెలియజేయాలనేదే గోదావరమ్మ ఉద్దేశ్యం. అయితే తన అభిప్రాయం ఎంత వరకూ సీతకు అర్థమయ్యిందోననుకుంటూ ఆవిడ నిట్టూర్చింది.

* * *